PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA

DK MEDIA

OUR SERVICES
* NEWS PAPER
* NEWS CHANNEL
* DK GRAPHICS
* DK ADS & PROMOTIONS
* DK PRINTERS
* DK PUBLICATIONS

WE'RE HIRING REPORTERS

for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 23 శుక్రవారం, ఆగస్టు 21 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై

## మహేశ్ గౌడ్ ఆగ్రహం

**అందరూ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచన**




**హైదరాబాద్ :**తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో క్రమ శిక్షణే ప్రధానమని, ఎంతటి వారైనా హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత (మంత్రి కొండా సురేఖ కుమార్తె), కాంగ్రెస్ ఎమ్మెల్యేపై సీనియర్ నేత చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కొండా సుస్మిత వ్యవహారంలో ఆమె తల్లి, మంత్రి కొండా సురేఖకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరామని తెలిపారు. వారు ఇచ్చే వివరణ ఆధారంగా క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు తగిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఎవరికి వారు తమకు తామే అభ్యర్థులుగా ప్రకటించుకోవడం సరికాదని చురకలం టించారు. కాంగ్రెస్‌లో సీట్ల కేటాయింపుకు స్పష్టమైన నియమావళి, ఎన్నికల కమిటీలు ఉంటాయని, అందరూ పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. 22ఏ భూముల వ్యవహారంలో కింది స్థాయిలో జరిగిన పొరపాటుపై ప్రతిపక్షాలు కావాలనే బురద జల్లుతున్నాయని మండిప డ్డారు. ఈ విషయం తమ ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

జహీరాబాద్ స్మార్ట్ సిటీతో

# రూ.15,000 కోట్ల పెట్టుబడులు,

- 2 లక్షల ఉద్యోగాల లక్ష్యం
- 2028 మార్చి నాటికి మౌలిక సదుపాయాల పూర్తికి ప్రణాళిక
- మొదటి దశలో 3,245 ఎకరాల్లో పారిశ్రామిక నగరం నిర్మాణం
- ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలపై ప్రధాన దృష్టి
- హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా అభివృద్ధి



**హైదరాబాద్ :**జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ద్వారా తయారీ రంగంలో సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2028 మార్చి నాటికి ఈ ప్రాజెక్టులో కీలకమైన మౌలిక సదుపాయాలను పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటీవల వెల్లడించారు.జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు సంస్థ (నిక్డిట్) సమావేశంలో తెలంగాణ సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి ఈ వివరాలను తెలిపారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉండేలా జహీరాబాద్ పారిశ్రామిక నగరాన్ని తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేస్తున్నట్లు ఆయన వివరించారు.హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో మొదటి దశలో 3,245 ఎకరాల్లో జహీరాబాద్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 17 గ్రామాల్లో 12,635 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఇండస్ట్రియల్ నోడ్, జహీరాబాద్ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) నివేదిక ప్రకారం, మొదటి దశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 1,90,031 ఉద్యోగాల కల్పనను అంచనా వేశారు.ప్రాజెక్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం.. సుమారు 1,939 ఎకరాలను పారిశ్రామిక అవసరాలకు, 55 ఎకరాలను లాజిస్టిక్స్ కోసం, 607 ఎకరాలను పచ్చదనం కోసం కేటాయించారు. మిగిలిన భూమిని రోడ్లు, వాణిజ్య, నివాస భవనాలు, ఇతర ప్రజా సౌకర్యాల కోసం వినియోగించనున్నారు. ఆటోమొబైల్స్, రవాణా పరికరాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, లోహాలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలను ఇక్కడ ప్రధానంగా ప్రోత్సహించనున్నారు. జాతీయ రహదారి 65కి సమీపంలో ఉండటం పరిశ్రమలకు రవాణా సౌకర్యాన్ని పెంచనుంది.ఇదే స్మార్ట్ సిటీలో హ్యుందాయ్ గ్రూప్ రూ.8,500 కోట్లతో గ్లోబల్ ఇన్నోవేషన్, రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని శ్రీధర్ బాబు గత జూన్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం ప్రకటించిన రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 2 లక్షల ఉద్యోగాలు కేవలం ప్రాజెక్ట్ లక్ష్యాలు మాత్రమేనని, ఇప్పటికే ఖరారైన ఒప్పందాలు కావని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కార్మికమంత్రి వివేక్ వెంకట్ స్వామితో

## పాలిటెక్నిక్ జేఏసీ భేటీ




**హైదరాబాద్ :**పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో ఏడాదిలో చేరవచ్చని, ఆ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనంపై కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాలిటెక్నిక్‌లను అప్‌గ్రేడ్‌చేసే ఆలోచ నతోనే శక్తి డిపార్ట్‌మెంట్‌లో తీసుకున్నా మని పేర్కొన్నారు.లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ సెకండ్ ఇయర్‌లో చేరొచ్చు : బ్లూకాలర్ జాబ్‌లలో కూడా రాష్ట్ర యువత ముందుండాలనేదే ప్రభుత్వ ఆలోచన అని వెంకటస్వామి తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతార న్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ రెండో సంవత్సరం లో చేరొచ్చని ఆయన తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనమైనప్పటికీ పాలిటెక్నిక్ ఫీజులో ఎలాంటి మార్పు ఉండదన్న మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. లెక్చరర్ల డిప్యూటేషన్, బదిలీ విధానంలోనూ మార్పులు ఉండవన్నారు. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వరంగల్‌లోవిద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐని బదిలీ చేశామని తెలిపారు.

గోదావరి--కావేరి అనుసంధానంతో తమిళనాడు ఎ

## నీటి సమస్యకు పరిష్కారం!



**మామల్లపురం:**
కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన తమిళనాడులోని మహాబలిపురం (మామల్లపు రం) వేదికగా జరిగిన దక్షిణ మం డల మండలి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం, కేంద్ర-రాష్ట్రాల భాగస్వామ్యం, ప్రాంతీయ అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా పలు కీలక ప్రతిపాద నలను ఆయన సభ ముందుంచారు.ఈ సమావే శంలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రు లు, కేంద్ర మంత్రులు పాల్గొని నీట్ వివాదం, కావేరి జలాలు, భవిష్యత్ నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలపై చర్చించారు.దక్షిణాది ఆర్థికాభివృద్ధికి రవాణా వ్యవస్థల అనుసంధానం అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు..కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్: ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానిస్తూ హై-స్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ మార్గాన్ని కుప్పం మీదుగా నిర్మిస్తే మూడు రాష్ట్రాల ప్రజల కు, వాణిజ్య రంగానికి ఎంతో మేలు జరుగ ుతుందని వివరించారు.మెట్రో ప్రాజెక్టులకు అనుమతులు: విశాఖపట్నం మరియు విజయ వాడ మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన అనుమతులు మంజూ రు చేయాలని కోరారు.సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఎ పోలవరం: సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పా సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ శాఖలో 30 శాతం

## కమీషన్ల రాకెట్ నడుస్తోందని ఆరోపణ




**హైదరాబాద్ :**తెలంగాణలోని రెవెన్యూ శాఖలో నిషేధిత భూముల పేరుతో బహిరంగంగా దందాలు, వేధిం పులు సాగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన బహిరంగ లేఖ రాశారు. ఈ అక్రమాలకు కేంద్ర బిందువుగా ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.చట్టప్రకారం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు అడ్డుకోవాల్సిన 22ఏ నిబంధనను, ప్రైవేట్ ఆస్తులపై కావాలనే కృత్రిమ వివాదాలు సృష్టించి డబ్బులు గుంజడానికి వాడుకుంటు న్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జూబ్లీహి ల్స్, బంజారాహిల్స్ నుంచి ప్రారంభించి హైద రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులు ఉన్న వేలాది ప్లాట్లు, నివాసాలను ఏకపక్షంగా నిషేధిత జాబి తాలో చేర్చి సామా న్యులను తీవ్ర భయాం దోళనలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితమే క్రమబద్ధీకరించిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములను, క్లియర్ రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న ఆస్తులను మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుర్మార్గమని విమర్శించారు.ె ంవెన్యూ శాఖలో ఏకంగా 30 శాతం కమీషన్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు ఆరోపిం చారు. ఒకసారి 22ఏ జాబితాలో పెట్టిన భూములను మళ్లీ తొలగించాలంటే మార్కెట్ విలువలో 30 శాతం కమీషన్లు ఇవ్వాలని దళారులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేకించి ఓఆర్ఆర్ పరిసరాల్లో ఉన్న అత్యంత విలువైన భూములను బ్లాక్ చేసి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లకు ఒప్పుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. యాదాద్రి జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా బయటపెట్టినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాల కు తావిస్తోందన్నారు.

# 22ఏ భూముల సమస్యకు చెక్..

**మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు**



**హైదరాబాద్, ఆగస్టు 20:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 22ఏ భూములపై వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాల్ సెంటర్‌కు ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చిన నేపథ్యంలో, ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు, సబ్‌రిజిస్ట్రార్లు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, సంబంధిత భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చిందో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్పష్టం చేశారు. అర్హులైన నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని మంత్రి పొంగులేటి అన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, 22ఏ భూముల సమస్యను ప్రత్యేక టాస్క్‌గా తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్-రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం చేయడంతో పాటు ప్రజలకు పూర్తి భరోసా కల్పించేలా అధికారులు పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

### 'ఇకపై బుజ్జగింపు రాజకీయాలు పనిచేయవు'




**న్యూ ఢిల్లీ :**జాతీయ గీతం వందేమాతం విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. వందేమాతరం తొలి రెండు చరణాలనే ఆలపించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆ పార్టీ మరోసారి బుజ్జగింపు రాజకీయాల ను ఆరోపించారు. ఈ నిర్ణయం దేశ విభ జనకు దోహదపడిన ఒక చారిత్రక తప్పి దాన్ని పునరావృతం చేయడమే నని ఆరోపిం చారు. మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

- క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ



**హైదరాబాద్ :**సీఎం రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమ శిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పంది స్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు.తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధ మని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రె స్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ మైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.

PRGI No: TGBIL/25/A0946

విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక



# గండుగులపల్లిని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయాలి

- 242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పూర్తి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** గండుగులపల్లిని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయాలని 242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పూర్తి చేయడం జరిగిందని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. దమ్మపేట మండలంలో అభివృద్ధి పనులు ప్రజలకు అందుతున్న వైద్య సేవలు విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గండుగులపల్లి మోడల్ సోలార్ గ్రామం మదనపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

దమ్మపేట మండలం పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజలకు అందుతున్న వైద్య సేవలు ఇన్‌పేషెంట్ ఔట్‌పేషెంట్ రోగుల వివరాలు వైద్యులు సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఇన్‌పేషెంట్ ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు.

రక్త పరీక్షల విభాగాన్ని పరిశీలించిన సందర్భంగా అనాలసిస్ యంత్రం పనిచేయకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. అది ఎప్పటి నుంచి పనిచేయడం లేదని సిబ్బందిని ప్రశ్నించగా సుమారు ఏడాది కాలంగా పనిచేయడం లేదని తెలిపారు. యంత్రం నిర్వహణ మరమ్మతుల కోసం ఇప్పటికే దరఖాస్తు సమర్పించామని సిబ్బంది వివరించారు. దీనిపై జిల్లా వైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదించిన కలెక్టర్ "మీ ఇంట్లో ఏదైనా పరికరం పనిచేయకపోతే ఇలాగే వదిలేస్తారా అని ప్రశ్నించారు. సుమారు రూ.3 లక్షల విలువైన వైద్య పరికరం ఏడాది కాలంగా పనిచేయకపోయినా దాని మరమ్మతులు నిర్వహణకు సకాలంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన కీలకమైన పరికరాలు పనిచేయని పరిస్థితిలో ఉంటే వెంటనే స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్య పరికరాల పనితీరును సమగ్రంగా పరిశీలించి పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలోని వైద్య పరికరాల నిర్వహణ బాధ్యతను సంబంధిత మెడికల్ అధికారి లేదా ప్రత్యేక అధికారికి అప్పగించాలని అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మోడల్ సోలార్ గ్రామం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సోలార్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్యానెళ్లను పరిశీలించి సోలార్ యూనిట్ల ఏర్పాటు పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 424 మంది గృహజ్యోతి లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో స్లాబ్ ఉన్న 250 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటివరకు 242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయని వివరించారు. 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్‌ను ఒక్కో ఇంటికి సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ ద్వారా సుమారు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని లబ్ధిదారులు తమ గృహ అవసరాలకు వినియోగించుకున్న అనంతరం మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసి యూనిట్‌కు రూ.2 చొప్పున చెల్లిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్ సోలార్ యూనిట్ల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకంతో పాటు సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మిగిలిన ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, గ్రామాన్ని ఆదర్శవంతమైన మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేసేలా పనులను సమన్వయంతో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మదలపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు కిచెన్ డైనింగ్ హాల్ తరగతి గదులు డిజిటల్ క్లాస్‌రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు ఉపాధ్యాయులు సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌లో చెత్తాచెదారం అపరిశుభ్ర వాతావరణం ఉండటంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన పాఠశాలలో తరగతి గదులను సైతం పరిశుభ్రంగా ఉంచకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు తరగతి గదులు ఇతర ప్రాంతాలను వెంటనే పూర్తిస్థాయిలో శుభ్రం చేసి తీసుకున్న చర్యలకు సంబంధించిన ఫోటోలను పంపించాలని ఆదేశించారు.

అనంతరం డైనింగ్ హాల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజనంపై వివరాలు తెలుసుకున్నారు. ఆ రోజు మెనూ ఏమిటని, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించి భోజనం తయారీ ఆహార పదార్థాల నాణ్యత పరిశుభ్రతను పరిశీలించారు. మెనూలో పేర్కొన్న కూర అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ వార్డెన్‌ను ప్రశ్నించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఎందుకు అందించడం లేదని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. డైనింగ్ హాల్‌లో డస్ట్‌బిన్ ఉన్నప్పటికీ దానిని సక్రమంగా నిర్వహించకపోవడంతో హాల్‌లో అపరిశుభ్రత నెలకొనడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన కనీస బాధ్యతను కూడా విస్మరించడంపై ప్రశ్నించారు. డైనింగ్ హాల్‌తో పాటు పాఠశాలలోని అన్ని ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని చెత్తాచెదారం కనిపించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణ పరిశుభ్రత మెనూ అమ లులో నిర్లక్ష్యం వహించినందుకు ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాధ్యతల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం ఆరోగ్యం భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా పాఠశాల లో విద్యుత్ సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన లైట్లు ఇతర విద్యుత్ పరి కరాలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశిం చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతా వరణంతో పాటు పరిశుభ్రమైన పరిసరాలు నాణ్యమైన భోజనం అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా పాఠశాల నిర్వాహ కులు బాధ్యతతో వ్యవహరించాలని ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించా లని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట శిక్షణ డిప్యూటీ కలెక్టర్, దమ్మపేట తహసీల్దార్ మురళి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సనత్‌నగర్ టిమ్స్‌కు కంజర్ల శంకర్ యాదవ్ పేరు పెట్టాలి

- అల్వాల్ టిమ్స్‌కు పండుగ సాయన్న
- ఎల్.బి. నగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లు పెట్టాలి
- టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాం, బీసీవై పార్టీ



**హైదరాబాద్, విశాలజ్యోతి :** తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సనత్‌నగర్ ఆసుపత్రికి మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టాలని తెలంగాణ ప్రభు త్వం తీసుకున్న నిర్ణయాన్ని భారత చైతన్య యువజన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. తొలి దశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి తూట్లు పొడిచి, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలకు తాకట్టు పెట్టిన మర్రి చెన్నారెడ్డి పేరును టిమ్స్‌కు పెట్టడం తెలంగాణ ఉద్యమ చరిత్రను, ప్రజల ఆత్మ గౌరవాన్ని అవమానించడమేనని వారు పేర్కొన్నారు. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టాలనే నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించి వెనక్కి తీసుకోవాలని బీసీవై పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ సంస్థలకు పేర్లు పెట్టే విషయంలో రాజకీయ ప్రాధాన్యతకే కాకుండా సామాజిక న్యాయం, ప్రజాసేవ, స్థానిక ప్రజలతో ఉన్న అనుబంధం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ తెలంగాణ పీఏసీ సభ్యులు అన్నారు. సనత్‌నగర్ ప్రాంతంలో విద్యా, సామాజిక రంగాల్లో విశేష సేవలందించిన బీసీ నేత కంజర్ల శంకర్ యాదవ్ గారి సేవలను గుర్తిస్తూ సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రికి ఆయన పేరు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. అలాగే నిర్మాణ దశలో ఉన్న అల్వాల్ టిమ్స్ ఆసుపత్రికి పండుగ సాయన్న గారి పేరు, ఎల్.బి. నగర్ టిమ్స్ ఆసుపత్రికి కొండా లక్ష్మణ్ బాపూజీ గారి పేరు పెట్టాలని కోరారు. తెలంగాణ సమాజ నిర్మాణంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహనీయులు, ప్రజాసేవకులు, ఉద్యమకారులు అందించిన సేవలకు ప్రభుత్వ సంస్థల నామకరణంలో సముచిత గుర్తింపు కల్పించాలని వారు స్పష్టం చేశారు. "బీసీల ఓట్లు కావాలి కానీ బీసీ నాయకులకు గుర్తింపు ఇవ్వం' అని బీసీవై పార్టీ పీఏసీ సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో బీసీల ప్రాధాన్యతను గుర్తిస్తూ, ప్రభుత్వ సంస్థల నామకరణంలో మాత్రం బీసీ నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వకపోవడం సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. ప్రభుత్వ సంస్థల పేర్లలో ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం సామాజిక న్యాయం కాదని, తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాల సేవలు, త్యాగాలు, చరిత్రకు సముచిత గౌరవం దక్కేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని బీసీవై పార్టీ డిమాండ్ చేసింది. సనత్‌నగర్ టిమ్స్ పేరు విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, స్థానిక ప్రజల అభిప్రాయాన్ని గౌరవించాలని, లేనిపక్షంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై బీసీవై పార్టీ ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తుందని తెలంగాణ రాష్ట్ర నాయకులు స్పష్టం చేశారు.

# కీటక జనిత వ్యాధులను నివారించాలి

- డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి



**వరంగల్ జిల్లా, విశాలజ్యోతి:** వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొమ్మన రాజారెడ్డి వారి ఆధ్వర్యంలో దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎం.హెచ్.నగర్ లో ఇటీవల డెంగ్యూ కేసులు నమోదైన దృష్ట్యా కీటక జనిత వ్యాధుల పట్ల స్థానిక ప్రజలకు అవగాహన కల్పిం చారు. సందర్భంగా స్థానిక వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కాలనీలో ర్యాలీ నిర్వహించినారు. ప్లకార్డులను ప్రదర్శించి ప్రజలకు డెంగ్యూ , మలేరియా వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్.బీ.రాజారెడ్డి మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ 20 ఆగస్టు 1897 వ సంవత్సరంలో ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుంది అని నిర్ధారించిన సందర్భంగా అతని గౌరవార్థం గత 126 సంవత్సరాలుగా ఈ రోజున ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని అన్ని తెలిపారు. డీ.ఎం.ఓ. డిస్టిక్ మలేరియా ఆఫీసర్ కె.రజిని మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం ద్వారానే వ్యాధులు నియంత్రించవచ్చు అనే నినాదం ద్వారా వ్యాధులను అరికట్టాలని అదేవిధంగా వైద్య సిబ్బంది ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి, ఆంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్, మాజీ కార్పొరేటర్ సురేష్ జోషి, సబ్ యూనిట్ ఆఫీసర్ కుమారస్వామి, హెచ్.

ఈ.ఓ సదానందం, హెల్త్ సూపర్వైజర్ మధుకర్, వైద్య సిబ్బంది కుమార స్వామి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నేల్, ఏ.ఎన్.ఎం.లు అమృత, అశ్విని, సర్వత్ సుల్తానా, మున్సిపా లిటీ ఇన్స్పెక్టర్ ప్రశాంతి, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు తది తరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధానమంత్రి భారతరత్న ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరికృష్ణ



**విశాలజ్యోతి (దంతాలపల్లి) దంతాలపల్లి** మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి భారతరత్న ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడుపుగంటి హరికృష్ణ మాట్లాడుతూ దేశంలో శాంతి సౌభ్రాతృత్వం మత సామరస్యం ఐక్యతను పెంపొందించాలనే సందేశంతో జరుపుకునే సద్భావనా దినోత్సవం ప్రజలందరికీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. 'సమైక్యతే మన శక్తి సద్భావనే మన ప్రగతి అనే స్ఫూర్తితో రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని శాంతి సౌభ్రాతృత్వం సమానత్వంతో కూడిన బలమైన భారతదేశ నిర్మాణానికి మన వంతు కృషి చేద్దాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు గురుపాల్ రెడ్డి సమన్వయ కమిటీ చైర్మన్ సాధు లింగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్ బిసి సెల్ అధ్య క్షులు తండా రాములు మైనార్టీ సెల్ అధ్య క్షులు షరీఫ్ దొనకొండ సర్పంచ్ ఆవుల సురేష్ యాదవ్ కొత్త యాకన్న గౌడ్ బొడ్డుపల్లి వెంకన్న రామవరం సర్పంచ్ దైద వెంకన్న తూర్పు తండా సర్పంచ్ పోట్యా నాయక్ కోమటి మురళి వేములపల్లి ఉపసర్పంచ్ ప్రసన్న దంతాలపల్లి ఉపసర్పంచ్ దాసరి వెంకన్న బొడ్లడా ఉప సర్పంచ్ బి. సతీష్ ఓలాద్రి రమేష్ రెడ్డి వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు ఏరుకొండ రమేష్ పొన్నం సోమన్న గుండాగాని వెంకన్న మార్త విజయ్ బానోత్ రవీందర్ నాగయ్య మల్లం శ్రీను ఏరుకొండ యాకన్న ఓలాద్రి రమేష్ రెడ్డి ఓలాద్రి వెంకట్ రెడ్డి కొప్పుల శ్రీను గండి వెంకట్ మద్రు శ్రీను నారాయణ మురికి అనిల్ కాయిత శ్రీను నరేష్ గుండాల భూపాల్ యాదవ్ యాకాంబరం అబ్దుల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మిడితపల్లి సురేందర్, ప్రదీప్ రెడ్డి, బొల్లు వీరన్న, చిల్లా సత్యనారాయణ దంతాలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామచంద్ర కళాశాలలో అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం




**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** ప్రభుత్వ శ్రీ రామచంద్రం ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ అటానమస్ కళాశాలలో 2026-2027 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

కామర్స్ విభాగంలో ఈ కామర్స్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలోకనీసం 55 శాతం మార్కులతో ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. నెట్/సెట్/పి హెచ్ డి అర్హత ఉన్న వారికి డిగ్రీ కళాశాలలో బోధన అను భవము ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. దరఖాస్తులు అవసరమైన సర్టిఫికెట్లతో కలిపి ఆగస్టు 22వ తారీకు సాయంత్రం నాలుగు గంటలలోపు శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ అటానమ్స్ కళాశాలలో సమర్పించాలి. ఇంట ర్వ్యూలు ఆగస్టు 24 ఉదయము 10 గంటల కు శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో నిర్వహిస్తారు.

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కామారెడ్డి జిల్లా, విశాలజ్యోతి:** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం, మల్లుపేట్ గ్రామంలో గ్రామాభివృద్ధికి మరో అడుగు పడింది. ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ గ్రామంలో మొత్తం రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డు, అలాగే రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రారంభించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు మహిళా సమాఖ్య భవనం మరింత ఉపయోగకరంగా మారనుండగా, నూతన గ్రామపంచాయతీ భవనం ద్వారా గ్రామ పరిపాలనా సేవలు ప్రజలకు మరింత సౌకర్యవంతంగా అందనున్నాయి. అలాగే సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగనుంది. గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే మదన్ మోహన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మల్లుపేట్ గ్రామంలో రూ.40 లక్షల అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడుకి సిపిఐ సన్మానం




**మహబూబాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బాలగాని శ్రీనివాస్ గౌడ్ ని సిపిఐ నేతలు ఘనంగా సన్మానం చేశారు. కురవి మండల కేంద్రం సిపిఐ పార్టీ కార్యాలయంలో ఇటీవల ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ గారు కురవి మండల కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా బాలగాని శ్రీనివాస్ గౌడ్ ను నియమించగా, మండల సిపిఐ నాయకత్వం శాలువా తో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల అర్హులైన పేదలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరే విధంగా, అభివృద్ధి పనులలో పారదర్శకత పాటించేలా చూడాలని, మిత్రపక్షమైన సిపిఐ కి సరైన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కురవి టౌన్ కార్యదర్శి తురక రమేష్, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగుర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైద్యునిగా సుగుణారావు




**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** గత మూడు సంవత్సరాలుగా ఎన్.డి.డి.వై వైద్య విద్యను పూర్తి చేసిన కొత్తగూడానికి చెందిన ప్రముఖ ఆల్టర్నేటివ్ తెరపిస్ట్ జి.సుగుణా రావు ప్రకృతి వైద్యునిగా సర్టిఫికెట్ అందుకున్నారు. గుంటూరు పట్టాభిపురంలోని "టెంపల్ ఆఫ్ హెల్త్ ఇన్స్టిట్యూట్లో " ఇన్స్టిట్యూట్ డైరెక్టర్డాక్టర్ ఎస్.కె. హుస్సేన్ చేతుల మీదుగా ఆయన ఈ సర్టిఫికెట్ను అందుకున్నారు. గాంధీ స్మారక్ ప్రకృతి చికిత్స సమితి ఆధ్వర్యంలోని గాంధీ నేషనల్ అకాడమీ ఆఫ్ నేచురో పతి(న్యూఢిల్లీ) నుండి సర్టిఫికెట్ అందుకున్న సుగుణారావుని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. సుగుణారావుతో పాటు కొత్తగూడానికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల కృష్ణయ్య, హైదరాబాద్ కు చెందిన డాక్టర్ తూమాట్ల వెంకన్నలు అందుకున్నారు.

వీరిని అభినందించిన వారిలో పర్యావరణ వేత్త మొక్కల వెంకటయ్య, పార ంపర్య వైద్య మహా సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, మన్ కీ బాత్ మొక్కల రాజ శేఖర్, ప్రముఖ సింగర్ వెంకటముత్యం, ప్రకృ తి ఆశ్రమం సభ్యులు కె హెచ్ ప్రసాద్, మహా మ్మద్ ముస్తఫా, మొక్కల ప్రేమికులు చిన్నా రులు నైనిక రజు వ, ఆఫాన్ జైది, శంకర్, దయానంద సాగర్, దశరథ్, శోభా రాణి, ఝాన్సీలు ఉన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీఆర్పీ నాయకులు

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, విశాలజ్యోతి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూరల్ మండలం కమలాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కోశాధికారి జినుకల శ్రీను భార్య జినుకల దివ్య కుటుంబాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ జిల్లా నాయకులతో కలిసి పరామర్శించారు. దివ్య కొంత కాలంగా తలలో కణితి కారణంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందడం పట్ల రవి పటేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దివ్య మృతితో భర్త శ్రీను, ఇద్దరు కుమార్తెలు తీవ్ర విషాదంలో ఉన్నారని, ఈ కష్టకాలంలో పార్టీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రవి పటేల్ మరియు జిల్లా నాయకులు కలిసి దివ్య కుటుంబానికి రూ.10,000 ఆర్థిక



సహాయం అందించారు. భవిష్యత్తులో ఇద్దరు కుమార్తెల చదువులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జినుకల శ్రీనుతో ఫోన్లో మాట్లాడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. పిల్లలను తాను తప్పకుండా కలుస్తానని, పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలోనే స్వయంగా ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శిస్తానని తెలిపారు. దివ్య మృతికి టీఆర్పీ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇనుగాల ప్రణయ్ రాజ్, పిట్టల వెంకటేష్, గండు కరుణాకర్, గంధం సతీష్, మడే సంతోష్, పింగిడి శంకరయ్య, మోట పోతుల సమ్మయ్య, శంకరయ్య, మేనం సంతో ష్, పిట్టల రాంబాబు, గట్టు శ్రీకాంత్, కోయ సమ్మయ్య, కమలాపూర్ గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ
## సభ్యురాలిగా పంజా కల్పన

**తొర్రూరు విశాలజ్యోతి:** మహబూబాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నివారణకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో తొర్రూరు పట్టణానికి చెందిన శ్రీమతి పంజా కల్పన గారికి సభ్యురాలిగా అవకాశం లభించింది. ఈ సందర్భంగా పంజా కల్పన గారు హర్షం వ్యక్తం చేశారు. ఎస్ సి మాల సామాజిక వర్గానికి చెందిన తనకు ఈ కీలకమైన కమిటీలో సభ్యురాలిగా అవకాశం కల్పించిన పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారికి, శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారికి పంజా కల్పన గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీ రాజేందర్ రెడ్డి గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆమె పేర్కొన్నారు. కమిటీ సభ్యురాలిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూఎస్ సి ఎస్ టి వర్గాల హక్కుల పరిరక్షణకు, అట్రాసిటీ బాధితులకు సకాలంలో న్యాయం అందేలా తన వంతు



కృషి చేస్తానని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, కమిటీ చైర్పర్సన్ శ్రీమతి స్నేహ శబరిష్, ఐ ఏ ఎస్ గారి ఆధ్వర్యంలో ఈ కమిటీ పనిచేయనుంది. ఎస్ సి , ఎస్ టి (అట్రాసిటీల నివారణ) చట్టం అమలు, బాధితులకు న్యాయం, పరిహారం, పునరావాసం తదితర అంశాలపై కమిటీ సమీక్షించి, బాధితులకు అండగా నిలవనుంది. తనకు లభించిన ఈ అవకాశాన్ని సామాజిక బాధ్యతగా భావించి, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని పంజా కల్పన గారు స్పష్టం చేశారు.

# కాజీపేటలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**హనుమకొండ, విశాలజ్యోతి:** కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కోరారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో జనరల్ మేనేజర్ను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను, ఈ ప్రాంతానికి ఉన్న రైల్వే ప్రాధాన్యతను జీఎంకు వివరించారు. కాజీపేట జంక్షన్ దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత కీలకమైన జంక్షన్గా ఉన్నప్పటికీ, దానికి తగిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నారు. కాజీపేట కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉందని, రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు, రైల్వే వినియోగదారులు కూడా ఈ డిమాండ్ను కోరుతున్నారని తెలిపారు. ఇటీవల రైల్వే జోన్లు, డివిజన్ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల



నేపథ్యంలో కాజీపేట డివిజన్ అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త రైల్వే జోన్, డివిజన్ల ఏర్పాటు జరుగుతున్న సమయంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కాజీపేటను ప్రత్యేక డివిజన్గా ఏర్పాటు చేస్తే పరిపాలనా సామర్థ్యం పెరగడంతో పాటు రైల్వే కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. రైల్వే ఆదాయంలో కాజీపేట ప్రాంతానికి కీలకమైన వాటా ఉందని ఎంపీ తెలిపారు. బల్లార్షా--కాజీపేట, కాజీపేట--విజయవాడ, కాజీపేట--కరీంనగర్, డోర్నకల్--మణుగూరు తదితర రైల్వే మార్గాలు సరుకు రవాణాకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయని చెప్పారు. బొగ్గు, సిమెంట్, బియ్యం, మిర్చి, గ్రానైట్, ఎరువులు తదితర సరుకుల రవాణాకు ఈ ప్రాంతంలో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్పై రైల్వే ట్రాఫిక్తో పాటు పరిపాలనా భారం కూడా పెరుగుతోందని, ఈ నేపథ్యంలో కాజీపేటను కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తే పనిభారం సమతుల్యం అవడంతో పాటు ఈ ప్రాంత రైల్వే అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్ అని, దీనిపై రైల్వే శాఖ సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎంపీ జీఎంను కోరారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుతో వరంగల్--కాజీపేట ప్రాంతంలో రైల్వే మౌలిక వసతులు, ప్రయాణికుల సౌక ర్యాలు, సరుకు రవాణా మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి కూడాఊతం లభిస్తుందని ఎంపీ పేర్కొన్నారు.

# పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలి

- తల్లిదండ్రులు, బంధువులు బాధ్యతగా వ్యవహరించాలి.
- విద్యార్థుల్లో నేర ప్రవృత్తిని ప్రోత్సహించరాదు.

**తొర్రూరు, విశాలజ్యోతి:** నేటి సమాజంలోని పిల్లల్లో పూర్తిగా క్రమశిక్షణారాహిత్యం, బాధ్యతారాహిత్యం, విచ్చల విడితనం పెరిగిపోవడం వలన పెద్దలపై, గురువులపై, తల్లిదండ్రులపై గౌరవభావం లేకపోగా వారిని అదుపు ఆజ్ఞలలో పెట్టేవారు లేకపోవడం వలన భయంభక్తిలేక అదుపుతప్పిపోవడంతో వారిలో నేర ప్రవృత్తి పెరిగిపోతున్నందున పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉన్నదని సామాజికవేత్త, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, స్టేట్ జనరల్ సెక్రటరీ దొనికెన కుమారస్వామి సూచించారు. గురువారం నాడు తొర్రూరు డివిజన్ కేంద్రంలో దొనికెన మీడియాతో మాట్లాడుతూ నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లిలో ఈ నెల 11వ తేదీన జరిగిన నాగార్జున కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యపై ఆవేదన వ్యక్తం చేస్తూ, హత్యను తీవ్రంగా ఖండించడం జరుగుతు న్నదని, దానికి విద్యార్థులు బాధ్యులు కావడం చాలా విచారించదగిన విషయమని అన్నారు. విద్యార్థుల్లో ఇలాంటి అవలక్షణాలు పెరిగిపోవడం సమాజానికి మంచిది కాదని, వారి



బంగారు భవిష్యత్తుకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా తీరని నష్టం జరుగుతుందని తద్వారా సమాజం బలహీనపడుతుందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. భావి భారత పౌరులు నేరాల్లో కూరుకుపోతే దేశ భవిష్యత్తుకు భంగం కలుగుతుందని, రేపటి తరం నిర్వీర్యమై నాసిరకంగా తయారయితే సమాజం విచ్ఛిన్నం అవుతుందని, కుటుంబాలకు కుటుంబాలు కూలిపోతాయని ఆయన అన్నారు. ఇలాంటి స్థితిలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఆత్మీయులు, సమాజం, మీడియా బాధ్యతగా వ్యవహరించి ఉపాధ్యాయ వ్యవస్థకు, పోలీసు వ్యవస్థకు పూర్తిగా సహకరించి విద్యార్థుల్లో, పిల్లల్లో చెడు అలవాట్లు, చెడు లక్షణాలను రూపుమాపడానికి తోడ్పడాలని దొనికెన కోరారు.

# శ్రమ దోపిడీ పై ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేయాలి

- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న

**మహబూబాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** చెమటలు చిందిస్తూ రెక్కలు ముక్కలు చేసుకొని ఉత్పత్తులు చేస్తున్న కార్మిక వర్గపు శ్రమ దోపిడిపై ఐక్య ఉద్యమాలు తీవ్రతరం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. టియుసిఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు అండర్ బ్రిడ్జి నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన చంద్రన్న మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం పునరేకీకరణతో సమరశీలంగా ఉద్యమిస్తుందన్నారు. ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే విముక్తిని సాధిస్తామని కార్మిక వర్గం గుర్తించాలన్నారు. భారతదేశంలో 45 కోట్ల మంది ఉన్న కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారుల దోపిడి కోసం బలి పశువులుగా మార్చటానికి లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. విశాల ఐక్య




ఉద్యమాలను నిర్మించే బాధ్యత చేపట్టాలని సూచించారు. టీయుసిఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి ఈ ధర్నాకు అధ్యక్షత వహిస్తూ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పరిపాలన అంటున్న ముఖ్యమంత్రి 73 కనీస వేతనాల జీవోలను రద్దుచేసి 6 జీవో పేరుతో కార్మికులకు తీరని ద్రోహం చేపట్టారని అన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న జీతాలను తగ్గించటం చట్ట విరుద్ధమని దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముందంపల్లి వీరన్న మాట్లాడుతూ కార్మికులు, వ్యవసాయ కూలీలు,రైతులు శ్రమ జీవుల ఐక్యతే మహాబలం అన్నా రు.ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క ర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్వ పల్లి వెంకన్న,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికశీటీ వెంక న్న,భోయిని ఉప్పలయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాం పుల్లయ్య, జిల్లా నాయకులు పూనెం రవి, తో పాటు మురళి కుమార్,పుల్లయ్య,వెంకన్న,వెంకన్న, కొమరయ్య.

శ్రీ రాములు,ఉప్పలయ్య,నెల్లుట్ల వెంక న్న ఇరుగు అనిల్ వసంతరవు బాబు లక్ష్మి, వెంకటమ్మ ఎలంద్ర రమ వీరమ్మ పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి బోట్ల గౌతమ్ దేవా న్ష తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన ఎస్సై
## ఆంజనేయులు



- 30 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్ గా పట్టివేత.

**కామారెడ్డి జిల్లా , విశాలజ్యోతి:** కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కేంద్రంలోని చెందిన ఓ వ్యక్తి కేసు విషయంలో స్టేషన్ బెల్ నిమిత్తం రాజంపేట ఎస్సై ఆంజనేయులు ఆశ్రయించాడు ఎస్సై పని చేసి పెడతానంటూ రూపాయలు లక్ష డిమాండ్ చేశాడు. చివరికి రు 50 వేలకు ఒప్పందం కుదురుచుకున్నాడు. బాధితుడు గతంలో 20 వేలు ముట్టజెప్పాడు. మిగతా రూ 30 వేలు ఇచ్చే క్రమంలో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. పథకం ప్రకారం కామారెడ్డి లోని ఎన్జివోస్ నివాసంలో బాధితుడు నుంచి రాజంపేట ఎస్సై ఆంజనేయులు రు 30, వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు నేరుగా పట్టుకున్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ చేసి ఇంజనీరింగ్ కాలేజీలకు పోతే తప్పేముంది ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనానికి రేవంత్ రెడ్డి తెచ్చిన శక్తి స్కీమ్‌పై విద్యార్థుల ఆగ్రహం వ్యక్త చేస్తున్నారని తెలిసిందే. పాలిటెక్నిక్ విద్యార్థినులను లేబర్లుగా మార్చేస్తున్నారని.. శక్తి స్కీమ్‌లో పాలిటెక్నిక్ కాలేజీని విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నారు. వెంటనే శక్తి స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వారి ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా నిలిచింద్.బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు మద్దతు తెలిపారు. విద్యార్థులతో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్న విద్యాశాఖ పరిధిలోని పాలిటెక్నిక్ కాలేజీల వేలాది మంది విద్యార్థులు ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా రోడ్డెక్కి వాళ్ల భవిష్యత్ గురించి హాహాకారాలు చేస్తుంటే మీరు మాత్రం కుటుంబసమేతంగా ఢిల్లీకి పోయి.. ఢిల్లీ నుంచి లండన్‌లో పెళ్లిళ్లకు పోయి అక్కడి నుంచి కొన్ని రోజులు హాయిగా సరదాగా గడిపేందుకు అమెరికాకు వెళ్లారు. ఇక్కడనేమో మీకు ఓటేసిన తల్లిదండ్రుల గర్భాన పుట్టిన బిడ్డలు తెలంగాణ పేదింటి ముద్దుబిడ్డలు రోడ్డు మీద ఇవాళ హాహాకారాలు చేస్తున్నారని మండిపడ్డారు.మీ ఆదేశాల మేరకు మీ కిందనే పనిచేస్తున్న పోలీసులు ఈ బిడ్డలందరి మీద ఘోరంగా దౌర్జన్యాలు చేశారు. రేవంత్ రెడ్డి విద్యార్హతలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన విద్యార్థి దశలో వనపర్తిలో పాలిటెక్నిక్ చదివిండు. దాని తర్వాత ఆయన ఏవీ కాలేజీలో బీఏ చేసిండు. దాని తర్వాత ఆయన రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా మారిండు. ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయిండు.. మీరు వనపర్తిలో పాలిటెక్నిక్ చేసి సికింద్రాబాద్ ఏవీ కాలేజీలో బీఏ చేసి మళ్లీ తర్వాత రియల్ ఎస్టేట్ దందాలకు పోగలిగినప్పుడు ఈ పిల్లలు పాలిటెక్నిక్ 3 సంవత్సరాలు చేసి ఈసెట్ పోతే తప్పేంది.. మీరు పాలిటెక్నిక్ చేసి బీఏ చేయగలిగినప్పుడు పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ చేసి ఇంజనీరింగ్ కాలేజీలకు .. అని ప్రశ్నించారు.

## సాగు నీటి కోసం మాజీ మంత్రి ఎర్రబెల్లి కాలువ బాట
### అడ్డుకున్న పోలీసులు పరిస్థితి ఉద్రిక్తం



**జనగామ:** జనగామ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల మండలకు సాగు నీరు విడుదల చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేపట్టిన కాలువ బాటను సింగరాజుపల్లి గ్రామంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా చేపట్టారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ ధర్నా చేస్తున్న ఎర్రబెల్లిని అరెస్ట్ చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కి తరలించారు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యంపై బీఆర్ఎస్ తరఫున ఉద్యమిస్తామన్నారు. ఎర్రబెల్లిని భేషరతుగా విడుదల చేయాలని ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా తోపులాటలో ఎర్రబెల్లికి నుదుటికి స్వల్పంగా గాయం కావడంతో పోలీసులు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు.

# పాఠశాల స్థాయి నాటక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం




**హనుమకొండ చౌరస్తా:** వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లా పాఠశాల స్థాయి బాలల నాటిక పోటీలను నిర్వహించనున్నట్టు క్లబ్ ఫౌండర్ నేరెళ్ల శోభావతి, కన్వీనర్ మర్రి రేణుక తెలిపారు. వారు గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను, నటనా కళను వెలికితీసి ప్రోత్సహించి, బాధ్యతాయుతమైన సమాజహితులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు.హనుమకొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ (ఆశ్రమ/గురుకుల) పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. నాటికలో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా అదే పాఠశాలకు చెందిన వారై ఉండాలి. ప్రతి నాటిక వ్యవధి 30 నుంచి 45 నిమిషాల మధ్య ఉండాలి. ముందుగా పాఠశాల యాజమాన్యా ల ఆధ్వర్యంలో విద్యార్థులతో నాటికలను సిద్ధం చేయించాలి. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ న్యాయ నిర్ణేతల బృందం పాఠశాలలను నేరుగా సందర్శించి, నాటికల నాణ్యతను పరిశీలించి తుది పోటీలకు ఎంపిక చేస్తుంది.సమాజంలో చైతన్యం రగిలించే ఆలోచనాత్మక కథాంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. కుల వివక్ష నిర్మూలన, మూఢనమ్మకాలు, నరబలుల వ్యతిరేక ప్రచారం, ఈవ్‌టీజింగ్/ అమ్మాయి లపై జరుగుతున్న వేధింపుల నివారణ, కలుషి త ఆహారం-ఆరోగ్య భద్రత ఇతర సామాజిక సంక్షేమ, చైతన్యవంతమైన అంశాల ఆధారం గా నాటికలు ఉండాలి.ప్రథమ బహుమతి రూ. 10,000, షీల్డ్, ప్రశంసాపత్రం, ద్వితీ య బహుమతి రూ. 8,000, షీల్డ్, ప్రశం సాపత్రం ఇస్తారు. ప్రదర్శించిన ప్రతి నాటిక కు ప్రదర్శన పారితోషికంగా రూ. 5,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, ఉత్తమ నటీనటులు, సాంకేతిక నిపుణులకు ప్రత్యేక జ్ఞాపికలు (వీవఎవత్‌శీం), ప్రశంసా పత్రాలు అందజేస్తారు. రిజిస్ట్రేషన్, ఎంట్రీల దాఖలుకు చివరితేదీ ఆగస్టు 30. అక్టోబర్ 15 నుంచి 30 వరకు పరిశీలిస్తారు. పోటీలు నవంబర్ 12, 13, 14 తేదీల్లో హనుమకొండలోని నేరేళ్ల వేణు మాధవ్ కళాప్రాంగణంలో నిర్వహిస్తారు. ఇతర వివరాలకు 8897552958, 88975 52958, 9963338116, 9985549900, 9866253646, 9030972224 నంబర్లకు ఫోన్ చేయాలి. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ సుమతి నాయుడు, సభ్యులు వీ లక్ష్మీ కాంతారావు, టీ లక్ష్మణరావు, నాగేశ్వరరావు, కే లలిత, ఎం లావణ్య ఎం రేణుక పాల్గొన్నారు.

# మంచిర్యాలలో కాకరేపుతున్న వెంకటస్వామి విగ్రహా ఆవిష్కరణ



**మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో కాకా విగ్రహ ఆవిష్కరణ రాజకీయంగా కాక రేపుతోంది. జిల్లా కాంగ్రెస్‌లో మళ్లీ వర్గ విభేదాలు తలెత్తడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో కొన్నేళ్లుగా కవర్‌తో కప్పి ఉంచిన కాకా గడ్డం వెంకటస్వామి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు వ్యతిరేక వర్గానికి చెందిన మంతెన జగన్‌మోహన్‌రావు, మాజీ వైస్ చైర్మన్ ఉప్పలయ్యతో పాటు భారీ సం ఖ్యలో కార్యకర్తలు కవర్ తొలగించి ఆవిష్కరించారు.అనంతరం విగ్రహానికి పాలాభిషేకంచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి వివేక్ వర్గంగా ఉన్న జగన్మోహన్ రావు విగ్రహాన్ని ఆవిష్కరించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విగ్రహావిష్కరణ అనంతరం జగన్ ఇంటి సమీపంలో భారీ ఎత్తున పోలీసుల మోహరించారు. మొన్న ఎంపీ వంశీ పర్యటన సందర్భంగా దండేపల్లిలో జరిగినట్లు ఇక్కడ సైతం గొడవలు జరిగే అవకాశం ఉందని తెలిసి పోలీసులను మోహరించినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. మొత్తానికి ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# సిద్దిపేట జిల్లాలో విషాదం బావిలోకి దూసుకెళ్లిన కారు నలుగురు మృతి



**సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో కి దూసుకెళ్లిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు.స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## జూరాల ప్రాజెక్టు వద్ద రోడ్డు ప్రమాదం
### ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

**జోగులాంబ గద్వాల :** విహారంలో విషాదం చోటు చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సందర్శనకు వచ్చి రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ధరూర్ మండల జూరాల ప్రాజెక్టు రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గానికి చెందిన శివకుమా ర్(మల్లేపల్లి), గణేష్(పీర్లగుట్ట), శ్రీకాంత్ (పెద్దాయపల్లి) ముగ్గురు కలిసి బైక్ పై జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు.బైక్ పై గద్వాల వైపు వెళ్తున క్రమంలో డ్యాం రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేక్ వద్ద బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్ కు ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు కిందపడ్డారు. గణేష్ , శివకుమార్ లకు తీవ్ర గాయాలయ్యాయి.గాయపడిన వారిని గద్వాల జిల్లా దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరంమహబూబ్‌నగర్ తరలించారు.

# రైతులకు కోతల్లేని కరెంట్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా



**నల్లగొండ :** నకిరేకల్ నియోజకవర్గంలో రైతులకు కోతల్లేని 24 గంటల నాణ్యమైన విద్యుత్తును అందజేయాలని కోరుతూ నల్లగొండలోని ట్రాన్సకో విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతన్నలతో కలిసి కాలిపోయిన బోరు మోటర్లతో పాటు ఎండిపోయిన వరి కట్టలతో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు రైతులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో నీళ్లు, కరెంట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.నియోజకవర్గంలో కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రెప్పపాటు కూడా కరెంట్ పోలేదని గుర్తు చేశారు. లో వోల్టేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రైతుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు.

## 30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

**హైదరాబాద్ :** స్టేషన్ బెయిల్ మంజూరి కోసం రూ. 30 వేలు తీసుకున్న ఎస్సైని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కామారెడ్డి జిల్లా రాజంపేట ఎస్సై దువ్వాల ఆంజనేయులుగురువారం తన ఇంటిలో బాధితుడు నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. తన కుమారుడికి స్టేషన్ బెయిల మంజూరు చేసి చార్జిషీట్‌లో తక్కువ శిక్షపడే సెక్షన్లు విధించాలని కోరుతూ బాధితుడు ఎస్సైను సంప్రదించాడు.దీంతో ఎస్సై లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారి వ్యూహం ప్రకారం ఎస్సై లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఎస్సైపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచామని ఏసీబీ అధికారులు వివరించారు. నంబర్ 1064కు గాని ,9440446106 అనే వాట్సప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# 22A నిషేధిత జాబితా భూముల దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాసిన హరీశ్ రావు



తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఎవీణా అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ఏ జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి ద 30% కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. 22ఏపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

# గద్వాల పట్టణంలో పట్టపగలే రెచ్చిపోయిన దొంగలు బంగారం నగదు అపహరణ



**జోగులాంబ గద్వాల :** గద్వాల్ పట్టణంలోని 2వ వార్డులో పట్టపగలే ఓ టీచర్ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి దాదాపు నాలుగు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరించినట్లు బాధితులు చెబుతున్నారు..ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గద్వాల సీఐ టంగుటూరి శ్రీనివాస్,పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

**చోరీకి గురైన బంగారం,నగదు ఎంత**

బాధితులు ఇద్దరు (భార్యాభర్తలు) టీచర్లు కావడంతో బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లి సాయత్రం తిరిగి వచ్చి చూసే సరికి తాళం విరిగి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, మొదట 5తులాలు బంగారం, రూ.2,50,000నగదు పోయిందని అన్నప్పటికి తర్వాత 4తులాలు బంగారం, రూ. 25వేలు మత్రమే చోరీకి గురైనట్లు తెలిసింది. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్ ని వివరణ కోరగా ప్రస్తుతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని విచారణ అనంతరం చోరీకి గురైన బంగారం, నగదు మొత్తంవాటిఎస్ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.